# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### మూడు గంటలిస్తే ఎవుసమెట్ల చేస్తం

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతులం ఎవరూ ఇబ్బందులు పడడం లేదు. గత ప్రభుత్వాల హయాంలో వ్యవసాయానికి కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రి, పగలు పొలం దగ్గరనే ఉండేవాళ్లం. సీఎం కేసీఆర్ 24గంటలు ఇవ్వడంతో ఆటోమేటిక్ స్టార్టర్లతో ఇంటి వద్ద ఉండి సెల్ ఫోన్‌తో మోటర్‌ను ఆన్ ఆఫ్ చేసేవాళ్లం. నాటి నుంచి రైతులం సంతోషంగా బతుకుతున్నం. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే రోజుకు 3గంటల విద్యుత్ వ్యవసాయానికి ఇస్తామని అంటున్నరు. ఆ పార్టీ నాయకులు, రేవంత్‌రెడ్డి టీవీల్లో ప్రచారం చేస్తున్నరు. కరెంట్ మూడు గంటలు ఇస్తే రైతులు ఎట్లా వ్యవసాయం చేసుకుంటరు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులకు నానా ఇబ్బందులు తప్పవు. వ్యవసాయంపై ఏ మాత్రం అవగాహన లేని రేవంత్‌రెడ్డితో ఆగం కాకుండా ఉండాలంటే మళ్లీ బీఆర్ఎస్‌కే ఓటేయాలి.

**-కందుల పెద్ద సమ్మిరెడ్డి, రైతు, (దమ్మక్కపేట, హుజూరాబాద్‌టౌన్)**



### 3 గంటల కరెంట్‌తో కాల్వ సాగుతదా?

ఎవుసం మీద కనీసం అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు కరెంట్‌పై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. 10హెచ్‌పీ మోటర్ బిగిస్తే బోర్లు ఎండిపోతయి. కాంగ్రెస్ నాయకులకు ఎవుసంలో సాధకబాధకాలు తెల్వదు. 10 హెచ్‌పీ మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడి పేలిపోయే ప్రమాదం ఉంది. సీఎం కేసీఆర్ పుణ్యమా.. అని 24 గంటల కరెంటు వస్తుంది. మూడు గంటల కరెంట్ వ్యవసాయనికి సరిపోతుందా? కాల్వ కూడా సాగది. పొలం ఎలా పారుతుంది. 10హెచ్‌పీ మోటర్‌ను ఏ ప్రాంతంలో వాడరు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే.

**- యల్లా మాధవరెడ్డి రైతు, పారువెల్ల (గన్నేరువరం)**

### కాంగ్రెసోళ్లకు తలెర్కనా.. తోకెర్కనా..?



రోజంతా అత్తున్న కరెంట్‌తో రైతులు సుఖంగా ఉంటున్నరు. ఇదీ కాంగ్రెసోళ్లకు ఇట్టం లేనట్టుంది. తెలంగాణ రాకమునుపు ఎవుసానికి కరెంటు కోసం పడిన బాధలు చాలు. మూడు గంటల కరెంటుతో మళ్లా గా కట్టాలు తప్పవ్. మూడు గంటల ఇత్తామంటున్న రేవంత్‌కు మతిలేనట్లుంది. ఆళ్లకు తలెరుకనా.. తోకెరుకనా?. సోయిలేని మాటలు మాట్లాడుతున్నరు. గిప్పుడు ఎప్పుడంటే గప్పుడే బాయి కాడికి పోయి మోటరు పెట్టుకుంటున్నం. మూడు గంటలు ఇత్తే పాత కథే ఉంటది. రైతులందరూ ఒకేసారి మోటరు పెడితే కాలిపోతయ్. ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతయ్. ఫ్యాన్ల కింద కూకొని మాట్లాడుడు కాదు...ఎవుసం జేత్తే తెలుత్తది.

**-యాళ్ల వీరారెడ్డి, రైతు (ఇప్పల్ నర్సింగాపూర్)**

### మళ్లీ టార్చిలైట్లు కొనుక్కునుడే



20 ఏండ్ల కింద అప్పటి గవర్నమెంట్ రాత్రి పూటనే ఎవుసానికి కరెంటు ఇచ్చేది. ఇక పొలానికి నీళ్లు పెట్టుటానికి అర్ధరాత్రి పొలంకాడికి పొయ్యి నీళ్లు పెట్టెటోళ్లం. పురుగో పుట్రో కాళ్ల కింద ఏముందో తెలవకుంట మొండిగ కరెంటు కాడికి పొయ్యి కరెంటు పెట్టినం. ఎప్పుడు కరెంటు ఉంటదో ఎప్పుడు ఉండదో తెలవక రాత్రంత జాగారం చేసేటోళ్లం. రాత్రంతా కూసుండి కరెంటు పెడితె ఒక్కమడి కూడా పారకపోయేది. తెలంగాణ గవర్నమెంట్ అచ్చినంక గా తిప్పలు తప్పినయి. రాత్రిపూట కరెంటు కాడికి పోవుడు బంద్రైంది. పగటీలే పొయ్యి కరెంటు పెడుతున్న, మళ్ల కేసీఆర్ అత్తెనే మా రైతులం మంచిగుంటం. లేకుంటె మళ్లీ టార్చి లైట్లు కొనుక్కునుడైతది.

**- ఏరు నారాయణరెడ్డి, తాడిజెర్రి(గంగాధర)**



### రాత్రింబవళ్లు బాయిల పొన్ననే ఉండాల్నా?

మాకు వాగు ఒడ్డున ఎకురంన్నర పొలం ఉండె.. వాగుల నుంచి పైప్ లైన్ ఏసినం.. అయితే అండ్ల ఈ నడుమ బైపాస్ రోడ్‌ల అరెకురం భూమి పోయింది.. ఇంక ఎకురం మిగిలింది.. వరి కోతలైనయ్.. మల్ల నాటుకు దున్నుతన్నం.. వాగుల దార సాగుతది గనుక నీళ్లైతె ఎప్పటికీ ఉంటయ్.. అయితె మునుపు పదేండ్ల కింది దాంక కరెంట్ లేక అరిగోస పడేది.. షిఫ్టుల కింద కరెంటు అచ్చేది.. ఓ సారి 4 గంటలు, ఓసారి 2 గంటలు, ఒక్కోసారి 3 గంటలు కరెంటు ఇచ్చేది.. వాగు చుట్టూ తిరిగి పోవడానికే మాకు పొద్దు గడిచిపోయేది.. తెల్లందాక పోయి మోటర్ పెట్టచ్చేది.. కేసీఆర్ పదవిల ఎక్కినంక కరెంటు మంచిగ ఉంటంది.. షాటేజ్ ఏంలేదు..సౌలతిగుంది.. పొద్దుందాంకనే పొలం పారిచ్చుకుంటన్నం.. ఇప్పటిదాంక లోటు లేకుంట ఇచ్చి కాంగ్రెస్ వస్తె 3 గంటలు ఇస్తమంటె రైతులు ఎట్ల ఒప్పుకొంటరు.. రైతులు మల్ల రాత్రింబవళ్లు బాయిల పొన్ననే తిరుక్కుంట ఉండాల్నా..

**- ఆకుల సదానందం, రైతు, కేశవపట్నం(శంకరపట్నం)**

### ఇప్పడే ఇన్ని ఏషాలేత్తన్రు.. మున్ముందు ఇంకెన్నిజేత్తరో..



ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణల ఎవుసానికి 24 గంటల కరెంటు ఇస్తుండడంతోటి రైతులకు మేలు జరుగుతున్నది. కాళేశ్వరం జలాలతో భూగర్భజలం పెరిగింది. గతంలో బాయిలు, బోర్ల కింద నీళ్లు లేక పడావుండేటివి. ఇప్పుడు ఆ భూములన్నీ సాగులోకి వచ్చి రెండు పంటలు సాగు చేసే పరిస్థితి ఉన్నది. మంచి దిగుబడి వచ్చి లాభపడుతున్నరు. కాంగ్రెస్ నాయకులు ఇప్పుడున్న కరెంటు సిస్టంను మారిస్తే రైతులకు మునుపటి గతి పడుతది. పంటలను కాపాడుకునేందుకు బాయిలు, బోర్ల దగ్గరే ఉండాల్సి వస్తది. ఒకసారి మూడు గంటలు అంటరు.. ఓసారి ఐదు గంటలంటరు.. ఇంకోసారి 10హెచ్‌పీ మోటర్లు పెడితే పారుతదంటరు. గిప్పుడే గిన్ని తీర్ల మాట్లాడుకుంట ఇన్ని ఏషాలేత్తన్రు.. వీళ్లని నమ్మితే మున్ముందు ఇంకెన్నిజేత్తరో?. అందుకే ఆళ్లను నమ్మేది లేదు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడమంటే రైతులను అప్పుల పాలు చేసే కుట్ర చేస్తున్నరు. గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థ కూడా 10హెచ్‌పీ మోటర్లకు సరఫరా చేసే విధంగా లేదు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ నాయకులు పల్లెల్లో రైతులను ఆగం చేసే ఆలోచన చేస్తున్నరు. ప్రతి రైతు ఆలోచించాలి.

**- గుంటి రాజమల్లు, (ముకరంపుర)**



### 24 గంటలు తీసేసి 3 గంటలిస్తరట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాకు నాణ్యమైన కరెంటు ఇస్తంది. మేము ఎప్పుడంటే అప్పుడు బావి దగ్గరకు వెళ్లి కరెంటు పెట్టుకుంటున్నం. గతంలో కరెంటు కోసం పొద్దనకా, రాత్రనకా ఎదురుచూసేది. గత 9 ఏండ్లసంది కరెంటుతో ఎలాంటి ఇబ్బంది లేదు. బాయిల నీరున్నంత సేపు కరెంటు మోటర్ నడుస్తున్నది. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకోమంటున్నరు. 10హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందులు ఉంటాయి. అవికాలిపోతే మాపై ఆర్థికభారం పడుతుంది. కాంగ్రెసోళ్లు ఇప్పుడున్న 24 గంటలు తీసేసి మూడు గంటలు ఇస్తరట. అసొంటి పార్టీ మాకెందుకు?. అది వచ్చేది లేదు. సచ్చేది లేదు. **- మునిపాల శ్రీనివాస్, వెన్కేపల్లి(సైదాపూర్)**

# కాంగ్రెస్ పాలనే దరిద్రం

- నమ్మితే మళ్లీ పాత రోజులే
- 24గంటలు కరెంట్ తీసేస్తరు.. మూడు గంటలే ఇస్తరు
- అది ఎప్పడిస్తరో తెల్వదు
- 10 హెచ్‌పీ మోటర్లతో బతుకులు ఆగమే
- మోటర్లకు మీటర్లు పెడుతరు.. నిండా ముంచుతరు

కరీంనగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌ను నమ్మితే పదేండ్ల కిందటి పరిస్థితులు పునరావృతం అవుతాయని జిల్లా రైతులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ వచ్చేదాక ఎసోంటి గోస పడ్డమో.. ఎన్ని కష్టాలు పడ్డమో ఆ భగవతునికే తెలుసని వాపోతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, అన్నదాతలను ముంచే కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అని చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. 24 గంటల కరెంట్ ఉన్న కాడ ఈ మాయమాటలేందని నిలదీస్తున్నారు. పైగా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంపై ఆగ్రహిస్తున్నారు. రెండు రోజుల క్రితమే ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని, కేంద్రం మంత్రి నిర్మలా సీతారామన్ మాటలతో కాంగ్రెస్ మోటర్లకు మీటర్ల పెట్టే కుట్ర బట్టబయలైందని మండిపడుతున్నారు. వాళ్లను నమ్మితే మోటర్లకు మీటర్లు పెడుతరని, 24 గంటల కరెంట్ తీసేసి 3 గంటల ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు వాళ్ల పాలనలో అరిగోస పడ్డామని, కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రిళ్లు జాగారం చేశామని, కండ్ల ముందే పంటలు ఎండుతుంటే కన్నీళ్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి ఎందరో రైతుల ఉసురు పోసుకున్న ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. కరెంట్ విషయంలో ఇటు బీజేపీ కూడా తెలంగాణ రైతులకు అన్యాయం చేసిందని ఆక్షేపిస్తున్నారు. కేసీఆర్ లేకుంటే తమ మోటర్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసేవారని, కానీ, తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మోటర్లకు మీటర్లు పెట్టనివ్వని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

### కాంగ్రెస్ కట్టుకథలు నమ్మం

సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే రైతును రాజు చేసిన్రు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ఇవ్వడంతో పాటు ఏటా రెండు పంటలకు సమృద్ధిగా నీళ్లు అందిస్తున్నరు. కాళేశ్వరం



గోదావరి జలాలతో పంటలకు సాగునీరు రావడంతో ఎలాంటి నీటి ఇబ్బంది లేదు. బీఆర్ఎస్ పాలన చూసి కాంగ్రెస్, బీజేపీ ఓర్వడం లేదు. మూడు గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు. ఆ పార్టీ కట్టు కథలు నమ్మడానికి ఇక్కడ ఎవరూ లేరు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలి. అప్పుడే రైతులకెంతో మేలైతది.

**- తోట లక్ష్మణ్, రైతు, ఇందుర్తి (చిగురుమామిడి)**

### కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు



రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్‌తో పొలం పారుతదని అంటుండు. అదీ పొద్దున ఇస్తరో, రాత్రి ఇస్తరో చెప్పరు. 3 గంటల కరెంట్ ఇస్తే ఒకేసారి రైతులు మోటర్లు స్టార్ట్ చేస్తే కాలిపోవుడు ఖాయం. కేసీఆర్ సీఎం అయ్యాక రైతుల కోసం 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. 24 గంటల కరెంట్‌తో ఎప్పుడు అవసరమైతే అప్పుడు మోటర్ పెట్టుకొని నీళ్లు పారిస్తున్నం. నాకు 8 ఎకరాల పొలం ఉన్నది. ఈ పొలానికి 3 గంటల కరెంట్ ఎలా సరిపోతది. మూడు గంటల కరెంట్ ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకుంటే మొదటికే మోసం తప్పదు. గా కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నట్టేట మునుగుడు ఖాయం. ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు.. ఆళ్లను నమ్మేది లేదు.

**-కంది దిలీప్‌రెడ్డి, రైతు, వంతడుపుల(ఇల్లందకుంట)**



### మూడు గంటలు ఎట్ల సరిపోతది?

మాకు ఐదెకరాల భూమి ఉంది. నేను ఒక ఎకరం పత్తి, ఎక ఎకరం పలు రకాల కూరగాయలు, మూడెకరాలు వరేసిన. ఇన్ని రోజులు 24 గంటల కరెంటుతో పంటలు మంచిగ పండించుకుంటున్న. ఇప్పుడు గా కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటిస్తే పంటలు పండిచ్చుడు సాధ్యమైతదని అంటున్రు. నాకున్న భూమిల తీరొక్క పంటలు పండిస్త. ఒక్కోపంటకు ఒక్కోసారి నీళ్లు పారిస్త. కరెంటు పొద్దున ఇస్తరో.. రాత్రి ఇస్తరో కాంగ్రెసోళ్లు చెప్పరు. మూడుగంటల కరెంటిస్తే రైతులు ఒకేసారి మోటర్లు స్టార్ట్ చేస్తే ఎక్కడికక్కడ కాలిపోతయ్. వాటిని బాగు చేయడానికి సమయం, డబ్బువృథా అయితయ్. అంతలోపు పంటలు ఎండిపోతయ్. తెలంగాణ రాక ముందు అప్పటి పాలకులు రాత్రి కరెంటు ఇస్తురు.. పొలాల దగ్గరే చెద్దరి వేసుకుని పాముల మధ్యన వ్యవసాయం చేస్తుంటిమి. ఇప్పుడు సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఎప్పుడు అవసరమైతే అప్పుడు మోటర్లను ఆన్ చేసి నీళ్లు పారిస్తున్నం. పంటలు మంచిగ పండుతున్నయ్. నేను 20 ఏండ్ల నుంచి ఎవుసం చేస్తున్న. కానీ, ఈ పదేండ్లళ్ల కరెంట్ కష్టాలను చూడలే. మూడు గంటల కరెంటిచ్చి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే మొదటికే మోసం వస్తది. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోడానికి ఖర్చు తడిసి మోపెడైతది. ఆ ఖర్చు ఎవరు భరిస్తరు? ఆ మోటర్లు బిగిస్తే బోర్లు ఎత్తిపోతయ్.. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లు అప్పుడు ఏంచేసిన్రు. ఇప్పుడు మల్ల రైతులను ముంచడానకి వస్తున్నరు. ఆ పార్టీ వచ్చేది లేదు సచ్చేది లేదు.. కేసీఆర్ సారు వచ్చినంకనే రైతులు మంచిగ బతుకుతున్రు. మళ్లీ కేసీఆర్ సారే రావాలి.

**- తాడెం మల్లేశం, గుడ్డెలుగులపల్లి, రామడుగు మండలం (చొప్పదండి)**



### వాళ్లు మళ్లచ్చుడు ఎందుకు? మేం ఆగమవుడెందుకు?

నాకున్న ఐదెకరాలు పారియాలంటే ఒక్క బావికి రెండు ఐదు హెచ్‌పీ మోటర్లు పెట్టినా పొలం పారేది కాదు. లోవోల్టేజీతో మోటర్లు కాలుడు, ఫీజు కొట్టేయడంతో చాలా ఇబ్బందయ్యేది. రాత్రి పూట పొలం కాడికి టార్చిలైట్లు పట్టుకొని పోయేవాళ్లం. పత్తి, మక్క చేన్లకు నీళ్లు కడుతుంటే గుడ్డెల్లులు వచ్చేవి. అరిచేతిలో ప్రాణాలు పెట్టుకొని రాత్రి పూట నీళ్లు కట్టేవాళ్లం. పది నిమిషాలకోసారి కరంటు పోయి వచ్చేది. కాలువ సాగకముందే పోయేది. ఒకరు కరంటు డబ్బాకాడ ఉండి మోటర్ ఆన్ చేస్తే ఒకలం నీళ్లు కట్టేది. మా మండలానికంత ఒక్క సబ్‌స్టేషనే ఉండేది. ఇప్పుడైతే మూడు గ్రామాలకో సబ్‌స్టేషన్ వచ్చింది. ఇప్పుడు పరిస్థితి మంచిగా ఉంది. పొద్దంతా పోయి కరెంటు పెడుతున్న. కాంగ్రెస్ పార్టీ వాళ్లు మూడు గంటల కరంటు అనడం రైతులకు మళ్లీ నరకం చూపించడానికే. వాళ్లు మళ్లచ్చుడు ఎందుకు? మేం ఆగమవుడెందుకు?. ఎట్టి పరిస్థితిలో వాళ్లరు రానిచ్చేదే లేదు.

**-మిడిదొడ్డి పోచయ్య, రైతు, మాందాడిపల్లి(హుజూరాబాద్‌రూరల్)**



### కౌలు చట్టంతో కష్టాలే

ధరణి వచ్చినంకనే నా భూమి పట్టా అయింది. గంట సేపట్లనే పట్టా చేసిన్రు, ఆన్‌లైన్‌లో అన్ని కాగితాలు తీసుకున్న. ధరణి రాకముందు తహసీల్దార్ ఆఫీస్ కాడా పడిగాపు కాసినా, పట్వారీ దొరికితే ఆర్ఐ దొరికేవాడు కాదు. వాళ్లు ఇద్దరు ఉంటే ఎమ్మార్వో ఉండకపోయేది. డబ్బులు ఖర్చైనా పని కాకపోయేది. ఎమ్మార్వో ఆఫీసు వద్ద ఏజెంట్లు ఉండేవారు. ప్రతి దానికీ రేటు కట్టియ్యాలి. లంచాలు ఎక్కువ ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ వాళ్లు మళ్లీ పాత పద్ధతి తీసుకువస్తే రైతుల కొంపలు మునిగినట్టే. కౌలు చట్టం వస్తే మళ్లీ కష్టాలు కొనితెచ్చుకున్నట్టే. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ధరణి వ్యవస్థే బాగుంది.

**- పోల్సాని రజనీకాంత్‌రావు, రైతు (హుజూరాబాద్‌రూరలల్)**

### దళారుల రాజ్యమస్తది

కాంగ్రెస్ ధరణిని రద్దు చేసి పాత పటేల్, పట్వారి వ్యవస్థ తెస్తమంటున్రు. భూముల సమస్యలు తీరలేక అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్లో వీఆర్వోల వెంబడి ఎమ్మార్వోల వెంబడి తిరిగినం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక ధరణి



తీసుకురావడంతో, రైతుల బాధలు తప్పినవి. కాంగ్రెస్ గవర్నమెంట్లో వీఆర్వోల దగ్గరకు తిరగడనికే బతుకులు సరిపోయినయి. ఇప్పుడు రైతులు ప్రశాంతంగా ఉంటున్రు. గప్పటి పరిస్థితి మళ్లీ వస్తే భూముల పట్టాలు ఆగమైతయి. దళారులు పుట్టుకొచ్చి వారే రాజ్యమేలుతరు. పంచాయితీలు పెట్టడానికి కాంగ్రెస్‌కు ఓటు వేయాలా? అప్పట్లో రిజిస్ట్రేషన్ దగ్గర లంచం ఇచ్చే పరిస్థితి ఉండేది. వీఆర్వోలకు, ఎమ్మార్వోలకు పైసలు ఇవ్వకుంటే పట్టా అయ్యేది కాదు. వీఆర్వోలు, ఎమ్మార్వోల దయ మీద ఆధారపడేటోళ్లం. మళ్లీ ఆ వ్యవస్థ రానివ్వం. కేసీఆర్‌కే మా మద్దతిస్తం.

**- నాంపల్లి శంకరయ్య, రైతు, మన్నెంపల్లి (తిమ్మాపూర్ రూరల్)**

### తాకులాటల కాంగ్రెస్‌ను తరిమికొడుతం

నాకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రికార్డుల ప్రకారం రైతు బంధు వస్తంది. ధరణి వచ్చినంక పట్టా చేసు




కోవడం ఈజీ ఐంది. ధరణితో రికార్డులు భద్రంగున్నయ్. భూముల ధరలు భారీగా పెరిగినయ్. అధికారుల మోసాలు తగ్గినయ్. అమ్మినా, కొన్నా సులభంగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయి. ధరణి ఎత్తేస్తే ఏ రైతు భూమి ఎవరికి ఉందో తెలియదు. ఇంత మంచి ధరణిని కాంగ్రెస్ రద్దు చేస్తామంటంది. అట్ల చేస్తే రైతులు అరిగోస పడుతరు. మళ్లీ పాత పద్ధతి తెస్తే పైరవీకారులు పుట్టుకొస్తరు. లంచాలు పెరుగుతయ్.. ఒకరి భూమి మరొకరికి రాసి గొడవలు పెడుతరు. గిట్ల తాకులాటలు పెట్టే కాంగ్రెస్‌ను తరిమి కొడుతం.

**- బొల్లం శ్రీనివాస్, రైతు, కొండపల్కల (మానకొండూర్ రూరల్)**

### కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తం

ధరణి రాకముందు భూమి అమ్ముదామన్నా.. కొందామన్నా తీవ్ర ఇబ్బందులు ఉండేటివి. ధరణి వచ్చినంక ఆ సమ



స్యలు అస్సలు లేవు. భూమి అమ్మినా నిమిషం వ్యవధిలోనే పని అవుతున్నది. కొన్నా అంతే టైం పడుతంది. గతంల భూమి అమ్మినా... కొన్నా పాస్ పుస్తకాల్లో నెలల తరబడి తిరిగినా మార్పులు జరగలే. దీంతో భూ యజమాని ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి అమ్మెటోళ్లు. ఇప్పుడు భూమి అమ్మినప్పుడు అప్పటికప్పుడే పట్టాలో వారి పేర్ల స్థానంలో కొన్నవారి పేర్లు వస్తుండటంతో అవకతవకలు జరుగడం లేదు. ఇదంతా ధరణి మూలంగానే అయింది. ధరణిని తీసివేస్తామనే కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఆ పార్టీ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

**- కే లక్ష్మణ్, కొండాపూర్ (కొత్తపల్లి)**

# ధరణిపోతే అరిగోసే

- పాత వ్యవస్థతో పరేషానే • మళ్లీ పైరవీలు, లంచాలు
- భూములకు భద్రత ఉండదు • యజమానులు, కౌలుదారులకు గొడవలే
- కాంగ్రెస్ కుట్రలపై భగ్గుమంటున్న అన్నదాతలు
- ఆ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరిక

కరీంనగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తమ భూముల భద్రత కోసం తెచ్చిన ధరణిని తొలగిస్తామని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై జిల్లా రైతులు భగ్గుమంటున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్న ఆ పార్టీని, తామే బంగాళాఖాతంలో వేస్తామని తేల్చిచెబుతున్నారు. ధరణితో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, భూములకు భద్రత పెరిగిందని, నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని చెబుతున్నారు. ఇది లేకుంటే ఇప్పుడు పెరిగిన భూముల ధరలను చూస్తే ఎన్ని మోసాలు, ఎన్ని గొడవలు జరిగేవోనని అంటున్నారు. ఒకప్పుడు తమ భూముల భద్రతపై అనేక అనుమానాలు ఉండేవని, ఇప్పుడు తమ భూములకు పూర్తి భద్రత ఏర్పడిందని చెబుతున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని మండిపడుతున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థలను నెలకొల్పి భూరికార్డులు తారుమారు చేసే సంస్కృతి ఆ పార్టీదని, ఇప్పుడు అదే వ్యవస్థను తెచ్చే ప్రయత్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆ నాయకులను నమ్మితే మొదటికే మోసం వస్తుందని, మళ్లీ పాత వ్యవస్థతో అరిగోస తప్పదని హెచ్చరిస్తున్నారు. లంచం లేనిదే ఒక్క పనీ కాదని, లేదంటే నెలల కొద్దీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, పైసలిస్తే రికార్డులు మారుతాయని, కొత్త పేర్లు పుట్టకొస్తాయని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. పట్టా పాస్‌బుక్‌లో అనుభవదారు కాలం వస్తే గొడవలు మొదలవుతాయని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ధరణి వ్యవస్థ కారణంగా ప్రతి పసలుకు రైతుబంధు కింద పెట్టుబడి సహాయం క్రమం తప్పకుండా సులువుగా పడుతున్నదని, ఇప్పుడు ఈ పద్ధతి మారిస్తే గతంలోలాగే అధికారులతో తిప్పలు తప్పవని వాపోతున్నారు. కాంగ్రెస్ అచ్చేది లేదు.. సచ్చేదు లేదు గానీ, పూటకోమాట చెబుతూ పరేషాన్ చేస్తున్నదని మండిపడుతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాకుండానే అడ్డుకుంటామని, భూములకు రక్షణ కల్పించి, ఇబ్బందులు లేకుండా చేసిన కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

### ధరణిని వద్దన్న కాంగ్రెస్ మాకద్దు



ధరణి పోర్టల్ రైతులకు సౌకర్యవంతంగా ఉన్నది. భూమి రిజిస్ట్రేషన్, తర్వాత మ్యుటేషన్ కోసం రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. తహసీల్దార్ కార్యాలయంల రిజిస్ట్రేషన్ చేయించుకోగానే పాస్ బుక్ ఇంటికే వస్తున్నది. ఇట్లా రైతులందరికీ ధరణితో న్యాయం జరుగుతున్నది. రైతుల కష్టాలు తెలిసిన సీఎం ధరణిని తీసుకువచ్చిన్రు. మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ధరణిని కాంగ్రెసోళ్లు వద్దంటున్నరు. అట్లాంటి పార్టీ మాకెందుకు?. వాళ్లను నమ్మేది లేదు. ఆ పార్టీని రానిచ్చేదే లేదు.

**- కచ్చు శ్రీకాంత్, రైతు, వెన్కేపల్లి(సైదాపూర్)**

### కాంగ్రెసోళ్లనే బంగాళాఖాతంల వేయాలె..

ధరణి పోర్టల్‌తో భూములు భద్రంగా ఉండడంతో రైతులం కంటి నిండా నిద్ర పోతున్నం. ధరణి తీసేస్తే పైరవీకార్లు రాజ్యమేలుతరు. పటేల్ పట్వారీల వ్యవ




స్థలో క్షణాల్లో పహాణీలో పట్టాదారు పేరు దొంగతనంగా మార్చేది. రైతులు చెప్పులరిగేలా తిరిగినా పనులు కాకపోయేది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ పెట్టడంతో దళారులు, లంచాలకు చెక్ పడింది. ధరణిని కాంగ్రెసోళ్లు బంగాళాఖాతంలో వేస్తామంటున్నరు.. అసలు ధరణిని కాదు.. కాంగ్రెసోళ్లనే బంగాళాఖాతంల వేయాలె. ధరణిని రద్దు చేస్తే రెవెన్యూ వ్యవస్థ ఆగమైతది. నాకు రెండెకరాల భూమి ఉంది. నాకు ప్రభుత్వం నుంచి రైతుబంధు డబ్బులు నేరుగా ఖాతాల్లో పడుతున్నయ్. ధరణే లేకుంటే వ్యవసాయ పథకాలెట్ల వస్తయ్. ధరణిని తీసేస్తమంటే ఊరుకుంటమా.? **-రావుల ఎల్లయ్య (ఇల్లందకుంట)**

### దళారులొద్దు.. ధరణే కావాలి

పాత రెవెన్యూ వ్యవస్థను తెలంగాణ ప్రభుత్వం సంస్కరించింది. కొత్తగా తీసుకువచ్చిన ధరణి పాసుపుస్తకంతో రైతుకు అన్ని విధాల మేలు జరుగుతున్నది. అప్పు తీసుకోవాలన్నా, భూమి అమ్మినా, కొన్నా ఎవరినీ బతిలాడి దండం పెట్టే అవసరమే లేదు. ఏ పనైనా నిమిషాల్లో అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నది. మన దగ్గర తప్ప ఈ విధానం ఎక్కడా లేదు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఈ పద్ధతి దేశమంతా ఆచరించే విధంగా ఉన్నదని అన్ని రాష్ట్రాల్లో చెప్పుకుంటున్నరు. ఇంత మంచి సౌలతి ఉన్న ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నరు. ఇట్లయితే తిరిగి గతంలో ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తది. పాత రోజుల మాదిరిగా పట్వారీ, పాత పహాణి వ్యవస్థ తీసుకువస్తే కష్టాలు మొదలైనట్లే. కొత్తగా ఇబ్బందులు పడాల్సి వస్తది. లంచాలు ఇవ్వనిదే పని జరగని దుస్థితి ఉంటది. కాంగ్రెస్ నాయకులు రైతులను, రెవెన్యూ, భూముల రికార్డులను ఆగం చేసే ఆలోచన చేసే చేస్తున్నరు. అలా చేస్తే మళ్లీ దళారులు పుట్టుకొస్తరు.. ఆ దళారీ వ్యవస్థ వద్దే వద్దు. ధరణే కావాలి.

**- కొత్త రాజయ్య, కొత్తపల్లి (ముకరంపుర)**





### పాత పద్ధతి వస్తే మళ్లీ పైరవీలే..

ఒకప్పుడు రెవెన్యూ ఆఫీసులకు పోవాలంటే భయపడేవాళ్ళం. కనీసం పహాణీ తీసుకోవాలనా పైరవీకారులను పట్టుకోవాల్సి ఉండేది. ఒకరి పేరు నుంచి మరొకరికి భూమి బదలాయింపు చేసుకోవాలంటే నానా ఇబ్బందులు పడేవాళ్ళం. కానీ, ఇప్పుడు ధరణి వచ్చినకం చాలా సులువైంది. పట్టా బుక్ లేని ప్రతి ఒక్కరికీ పాస్ పుస్తకం ఉచితంగనే ఇచ్చిన్రు. భూమి వివరాలను మొత్తం ధరణిలోకి తీసుకోవడంతో చాలా సమస్యలు పరిష్కారమైనయ్. భూమి వివరాలు చూసుకోవాలంటే రెవెన్యూ కార్యాలయానికి పోవాల్సిన పని లేకుండా పోయింది. సెల్ఫోన్లో చూసుకునే అవకాశం సీఎం కేసీఆర్ కల్పించిండు. ఇంత మంచి ధరణిని తీసేస్తామని అనుడు సరికాదు. రైతులు కేసీఆర్ వైపే ఉన్నరు. ధరణిని కాపాడుకుంటం.

**- నడిగొట్టు మహేందర్, రైతు, ఇందుర్తి (చిగురుమామిడి)**